# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 357 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 6 ఏప్రిల్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# అమెరికా విమానాన్ని కూల్చేశాం... త్వరలో 'బిగ్ సర్‌ప్రైజ్' ఇస్తాం: ఇరాన్

**అమెరికాకు చెందిన సీ-130 విమానాన్ని కూల్చివేసినట్లు ప్రకటించిన ఇరాన్**

**అమెరికాకు త్వరలో పెద్ద సర్‌ప్రైజ్ ఇస్తామని తీవ్ర హెచ్చరికలు**

**తమ అసమాన యుద్ధ తంత్రంతో శత్రువును దెబ్బతీస్తామని వ్యాఖ్య**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

అమెరికాతో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అమెరికాకు చెందిన సీ-130 రవాణా విమానాన్ని తాము కూల్చివేసినట్లు ఆదివారం వెల్లడించింది. చిక్కుకుపోయిన ఒక అమెరికన్ సైనికుడిని గుర్తించేందుకు యూఎస్ చేపట్టిన ఆపరేషన్ సందర్భంగా ఈ ఘటన జరిగిందని పేర్కొంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా గగనతలంలోకి వచ్చిన పలు "ఫ్లయింగ్ ఆబ్జెక్ట్స్"ను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపింది. ఫార్స్ న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం ఒక ఇరాన్ అధికారి మాట్లాడుతూ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "అమెరికాకు, దాని మిత్రపక్షాలకు మా వద్ద ఒక పెద్ద సర్‌ప్రైజ్ ఉంది. దానికి ఎంతో సమయం పట్టదు. దక్షిణ ఇరాన్‌లో వారి ప్రవర్తనను బట్టి మా ప్రణాళికల సమయాన్ని మరింత ముందుకు జరిపే అవకాశం ఉంది" అని ఆయన హెచ్చరించారు. అమెరికా సైనిక ఆపరేషన్లు విఫలమయ్యాయని, వారి టార్గెట్ కచ్చితమైంది కాదని ఎద్దేవా ..మిగతా 2లో





**ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ పదవి**

# బీజేపీ కైవసం

**సపోర్ట్ చేసిన బీఆర్ఎస్**

**మున్సిపల్ చైర్మన్‌గా అంకం మౌనిక,**

**వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి మహమ్మద్ షోయబ్**

**ఎన్నికల అధికారి ప్రకటన**

**ఖానాపూర్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ పదవి బీజేపీ కైవసం చేసుకుంది. ఘర్షణలతో శనివారం వాయిదా పడిన ఎన్నిక, రాజకీయ పరిణామాల మధ్య భారతీయ జనతా పార్టీ చేజిక్కించుకుంది. ఖానాపూర్ మున్సిపాలిటీని బీఆర్ఎస్ సాయంతో సొంతం చేసుకుంది. బీజేపీ నుంచి అంకం మౌనిక ఛైర్‌పర్సన్‌గా, బీఆర్ ఎస్ నుంచి మహ్మద్ షోయబ్ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జీవరత్నం ప్రకటించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక శనివారం జరగాల్సి ఉంది. ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా చేతులు ఎత్తే క్రమంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులతో ఎమ్మెల్యే వెద్మ బొజ్జు, కాంగ్రెస్ కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. మరోవైపు ..మిగతా 2లో

## రాజేంద్రనగర్‌లో తెలంగాణ కొత్త హైకోర్టుకు

# శంకుస్థాపన చేసిన సీజేఐ

**సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా కార్యక్రమం**

**ప్రజాస్వామ్యానికి ప్రతీకగా కొత్త భవనం నిలుస్తుందన్న సీఎం రేవంత్**

**2027 డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం**






**హైదరాబాద్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఆదివారం మరో కీలక అడుగు పడింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పరిధిలోని బుద్వేల్‌లో అత్యున్నత ప్రమాణాలతో నిర్మించనున్న హైకోర్టు జోన్-ఇఇ భవన నిర్మాణ పనులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ (జీబర్అఎవ ాబతీఝుస్ఝుత్) శంకుస్థాపన చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు, హైకోర్టుకు చెందిన పలువురు ప్రముఖ న్యాయమూర్తులు పాల్గొన్నారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుం టున్న ఈ నూతన ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో కూడిన కోర్టు గదులు, డిజిటల్ లైబ్రరీలు, పరిపాలనా విభాగాలు అందు బాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా రెండో దశలో న్యాయమూర్తుల క్వార్టర్ల నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉన్న హైకోర్టు భవనం వారసత్వ కట్టడంగా ఉన్నందున, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా బుద్వేల్‌లో ఈ కొత్త కాంప్లెక్స్‌ను ప్రభుత్వం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అత్యాధునిక సాంకేతిక ..మిగతా 2లో



**తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్‌కు**

# కొత్త నిబంధన

**ఇకపై ఆ టెస్ట్ తప్పనిసరి!**

2లో..

- డ్రైవింగ్ లైసెన్స్ జారీలో రానున్న కీలక మార్పులు
- లెర్నర్స్ లైసెన్స్‌కు ముందే ఆన్‌లైన్ రోడ్డు భద్రతా పరీక్ష తప్పనిసరి
- 3 గంటల నిడివితో ఆరు మాడ్యూల్స్‌లో ఆన్‌లైన్ శిక్షణ
- రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తెలంగాణ రవాణా శాఖ చర్యలు
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అమలుకు కసరత్తు


## హైదరాబాద్‌లో

# భారీ బస్ టెర్మినల్

**100 ఎకరాల్లో టీజీఎస్ఆర్టీసీ ప్రణాళిక**

- జీడిమెట్ల గాజులరామారంలో 100 ఎకరాల్లో భారీ బస్ టెర్మినల్
- అంతర్రాష్ట్ర, సిటీ బస్సుల కోసం వేర్వేరుగా టెర్మినల్స్ నిర్మాణం
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా రూపకల్పన
- ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక డిపో, చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు
- టీజీఎస్ఆర్టీసీకి భూమి కేటాయించిన మేడ్చల్ జిల్లా యంత్రాంగం

2లో..






**కవిత కొత్త పార్టీకి**

# 'టీఆర్ఎస్' పేరు?

**ఈ నెల 25న పార్టీ ఆవిర్భావం..**

**జయశంకర్ సిద్ధాంతాలే స్ఫూర్తి**

**జెండాలో గులాబీ రంగు ఉండదు.. కాంగ్రెస్‌తోనే ప్రధాన పోరు అన్న కవిత**

**మహిళా రిజర్వేషన్ వస్తే సిద్దిపేట లేదా గజ్వేల్ నుంచి పోటీ చేసే అవకాశం**

2లో..

# కవిత కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' పేరు?

### ఈ నెల 25న పార్టీ ఆవిర్భావం.. జయశంకర్ సిద్ధాంతాలే స్ఫూర్తి

### జెండాలో గులాబీ రంగు ఉండదు.. కాంగ్రెస్‌తోనే ప్రధాన పోరు అన్న కవిత

### మహిళా రిజర్వేషన్ వస్తే సిద్దిపేట లేదా గజ్వేల్ నుంచి పోటీ చేసే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**




తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన కొత్త పార్టీ ఏర్పాటు ప్రయత్నాల్లో వేగం పెంచారు. ఈ నెల 25వ తేదీన పార్టీని ప్రారంభించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన ఆమె, దానికి 'తెలంగాణ రాష్ట్ర సమితి' (టీఆర్ఎస్) పేరును పరిశీలిస్తున్నట్లు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. "పాత పేరు, కొత్త జెండా, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తాను" అని ఆమె చెప్పడం ఈ చర్చకు మరింత బలాన్నిచ్చింది. దీంతో తెలంగాణ ఉద్యమంతో ముడిపడిన పేరును కవిత సొంతం చేసుకోబోతున్నారా? అనే ఉత్కంఠ నెలకొంది. కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్ఎస్ పార్టీ, 'భారత రాష్ట్ర సమితి' (బీఆర్ఎస్)గా మారడంతో ప్రస్తుతం టీఆర్ఎస్ పేరు ఎవరైనా వాడుకోవచ్చని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ సెంటిమెంట్‌తో పాటు టీఆర్ఎస్ పేరుతో ముడిపడిన భావోద్వేగాలను తనవైపు తిప్పుకోవాలనేది ఆమె వ్యూహంగా కనిపిస్తోంది. అయితే, పార్టీ పేరు టీఆర్ఎస్ అయినా జెండాలో మాత్రం గులాబీ రంగు ఉండదని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల పునాదిపై నడుస్తుందని, 'బిహార్ సిద్ధాంతాలకు' తమ పార్టీలో చోటుండదని స్పష్టం చేశారు. పార్టీ రిజిస్ట్రేషన్ కోసం తెలంగాణ జాగృతి బృందం ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం వద్ద 'తెలంగాణ ప్రజా జాగృతి పార్టీ' పేరుతో ప్రక్రియ ప్రారంభించింది. తమకు ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీ అని కవిత ప్రకటించారు. అదే సమయంలో బీఆర్ఎస్‌ను 'ధనిక పార్టీ'గా ఆమె అభివర్ణించారు. పార్టీ ఆవిర్భావం రోజున అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి, ఉద్యమకారులతో కలిసి వేదికను పంచుకుంటామని తెలిపారు. డీఎస్పీ విశారదన్ మహరాజ్‌తో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. రానున్న ఎన్నికల్లో సిద్దిపేట లేదా గజ్వేల్‌లో మహిళా రిజర్వేషన్లు అమలైతే అక్కడి నుంచి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కవిత సూచనప్రాయంగా తెలిపారు. ఆడబిడ్డకు ఓటేయడం అనేది ఒక ఎమోషన్ అని వ్యాఖ్యానించారు. ఢిల్లీ మద్యం కేసు కొట్టివేతను ఉద్దేశిస్తూ.. "అదృష్టవంతుడిని ఎవరూ ఆపలేరు, ప్రకృతి నాకు సహకరిస్తోంది" అని ఆమె అన్నారు. భగవద్గీతలో ఉన్న నీతి ప్రకారం యుద్ధం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఇదే సమయంలో చంద్రబాబు నాయుడు కష్టపడి పనిచేస్తారని, పార్టీ నిర్మాణంలో టీడీపీ చాలా

# తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్‌కు కొత్త నిబంధన

**హైదరాబాద్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా తెలంగాణలో డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను కఠినతరం చేయనున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర రవాణా శాఖ ఈ మేరకు కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇకపై లెర్నర్స్ లైసెన్స్ (ఎల్ఎల్ఆర్) కోసం దరఖాస్తు చేసుకునే ముందే అభ్యర్థులు తప్పనిసరిగా రోడ్డు భద్రతపై ఆన్‌లైన్ అవగాహన పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న రెండంచెల విధానం (ఎల్ఎల్ఆర్, ఫైనల్ టెస్ట్) ఇకపై మూడంచెలుగా మారనుంది. ఇందులో భాగంగా, అభ్యర్థి మొదట ఆన్‌లైన్ రోడ్డు భద్రతా శిక్షణా కోర్సును పూర్తిచేయాలి. ఈ విధానంపై అధ్యయనానికి ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేశామని, ఏప్రిల్ నెలాఖరు నాటికి నివేదిక రాగానే దీన్ని తప్పనిసరి చేస్తామని రవాణా శాఖ జాయింట్ కమిషనర్ ఎం. చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఈ ఆన్‌లైన్ శిక్షణ మొత్తం 3 గంటల నిడివితో, ఆరు మాడ్యూల్స్‌గా ఉంటుంది. ఇందులో వీడియో పాఠాలు, ట్రాఫిక్ నిబంధనలు, సురక్షితమైన డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. అద్దాల సరైన వినియోగం, సురక్షితంగా ఓవర్‌టేకింగ్ చేయడం వంటి అంశాలతో పాటు, వాస్తవ ప్రమాదాల వీడియోలను చూపిస్తూ డ్రైవర్లు చేసే పొరపాట్లను వివరిస్తారు. అభ్యర్థులు ఇంటి నుంచే కెమెరా ఉన్న కంప్యూటర్ ద్వారా లేదా గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూళ్లలో ఈ పరీక్ష రాయవచ్చు. ఈ ఆన్‌లైన్ కోర్సు పూర్తి చేసిన వారికి ఒక యూనిక్ సర్టిఫికేట్ నంబర్ జారీ చేస్తారు. ఆ నంబర్‌తో మాత్రమే ఎల్ఎల్ఆర్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలవుతుంది. ఈ విధానం ద్వారా బాధ్యతాయుతమైన డ్రైవర్లను తయారు చేయవచ్చని, రవాణా కార్యాలయాల్లో దళారీల ప్రమేయాన్ని తగ్గించి పారదర్శకత పెంచవచ్చని అధికారులు భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఏటా సుమారు 1.7 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న నేపథ్యంలో ఈ మార్పులకు ప్రాధాన్యత ఏర్పడింది.




# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి

### కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లాలోని సామాజిక సమస్యల పరిష్కారానికి, అన్ని రంగాల్లో అభివృద్ధికి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో అందరూ కలిసికట్టుగా ముందుకెళదామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, దేశ ఉప ప్రధానిగా పనిచేసిన బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతినీ పురస్కరించుకుని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వివిధ శాఖల కేంద్ర మంత్రిగా పనిచేసిన జగ్జీవన్ రామ్ దూర దృష్టితో దేశంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. మహనీయుల జీవిత చరిత్రలు నేటి పిల్లలకు, భవిష్యత్తు తరాలకు తెలియాలంటే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఎంతో అవసరమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సీనియర్ సిటిజన్లు, చిన్నారుల సంక్షేమానికి అన్ని సంఘాల నేతలు కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. విద్యాపరంగా వెనుకబడ్డ జోగులాంబ గద్వాల జిల్లాలో విద్యార్థులు బడి మధ్యలో మానివేసే పరిస్థితులను రూపుమాపాల్సి ఉందన్నారు. సెన్సెస్ కు సంబంధించి మే మొదటి వారం నుంచి ఇండ్ల గణన చేపడుతున్నామని, వచ్చే ఏడాది జనాభా గణన చేసే నాటికి జిల్లా అక్షరాస్యతలో



మెరుగుపడేలా అన్ని సంఘాల నేతలు సహకరించాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాలని కోరారు. ఇటీవల జిల్లాలో పోక్సో కేసులు పెరుగుతున్నాయని, చిన్నారులపై అఘాయిత్యాల నివారణకు కృషి చేయాల్సి ఉందన్నారు. ప్రతినెల చివరి శనివారం అన్ని మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తామని, ఎక్కడైనా అంటరానితనం ఉన్నట్లు తెలిస్తే విజిలెన్స్ కమిటీ ద్వారా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు వక్తలు కోరినట్లు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ నూతన విగ్రహ ఏర్పాటుకు, అంబేద్కర్ భవన్ నిర్మాణానికి కృషి చేస్తామని, ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న సమస్యలను, ఇతర డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన వారందరికీ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా బ్రిటిష్ వారి నుంచి దేశానికి విముక్తి కలిగించేందుకు పోరాటం చేసినట్లే, జిల్లా సమస్యలను పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పలు సంఘాల నేతలు తెలిపిన సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం తరపున కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. అంతకుముందు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి కలెక్టర్ తో పాటు ఇతర అతిధులు, పలు రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నేతలు ప్రసంగించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు తమ పాటలతో అలరించారు. అలాగే ఐడిఓసి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ పలు ప్రజాసంఘాల నేతలతో కలిసి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, ఎస్సీ సంక్షేమ శాఖ ఈడి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, ఇతర అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీరుస్తాయి

### గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం ఆభినందయమని గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. గద్వాల మండలం సంగాల గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కీర్తిశేషులు చెట్టుకింద పార్వతమ్మ జ్ఞాపకార్థంగా గ్రామ సర్పంచ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ గ్రామ పెద్దలు అయ్యపు రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజశేఖర్, ఉప సర్పంచ్ చిట్టెమ్మ హనుమంతు రెడ్డి, వార్డు మెంబర్లు నవీన్, జగదీష్, వెంకట్ రాములు, గోవిందమ్మ, సవరన్న, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామపెద్దలు అయ్యప్పు రెడ్డి నరసింహులు, భాస్కర్ రెడ్డి, కృష్ణయ్య, శేఖర్ రెడ్డి, రామకృష్ణ, వీరన్న, మైలారం శివరాములు, సత్య రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, మధు రెడ్డి, పులి వీరన్న, చిన్న నరసింహులు, పాల నరసింహులు, యూత్ సభ్యులు నాగేష్, భీమేష్, ప్రవీణ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు గ్రేడింగ్ టెస్ట్ లో ప్రతిభ చాటిన కొత్తకోట విద్యార్థులు

**కొత్తకోట, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**



కొత్తకోట పట్టణంలోని బాలికల ఉన్నంత పాఠశాల ఆవరణ నిర్వహించిన బెల్టు గ్రేడింగ్ టెస్ట్ దాదాపు 30 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు ఈ పోటీలు గాడ్స్ ఆన్ వారియర్స్ షోతో ఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో చీఫ్ ఎగ్జామినేర్ క్లబ్బు ఫౌండర్ అబ్దుల్ నబీ సారథ్యంలో నిర్వహించడం జరిగింది వీటిలో విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి ఎల్లో ఆరెంజ్ గ్రీన్ బ్లూ మెరూన్ బెల్టులను ఎమ్మెల్యే జిఎంఆర్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... చిన్నారులు చిన్నతనంచే మార్షల్ ఆర్ట్స్ పై శ్రద్ధ చూపితే మానసికంగా శారీరకంగా ఎంతో దోహదపడుతుందని వారు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో కొత్తకోట మున్సిపాలిటీ మున్సిపల్ ఛైర్మన్ అరుణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ పల్లవి కృష్ణారెడ్డి వనపర్తి జిల్లా మెడికల్ హెల్త్ చైర్మన్ డాక్టర్ పి జె బాబు, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ మండల అధ్యక్షులు బీచుపల్లి, మున్సిపల్ కౌన్సిలర్స్ పట్టణ మైనార్టీ అధ్యక్షులు ఎజాజ్ అలీ పాల్గొన్నారు . ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపిన కార్యక్రమంలో క్లబ్బు సీనియర్ కరాటే మాస్టర్స్ జి హరీష్ యాదవ్ జాఫర్ సాదిక్ కార్తికేయ మేఘన అన్విత,యోగేశ్వరి పవన్ తేజ్ లు పాల్గొన్నారు



## అమెరికా విమానాన్ని కూల్చేశాం... త్వరలో 'బిగ్ సర్‌ప్రైజ్' ఇస్తాం: ఇరాన్

మొదటి పేజీ తరువాయి...

చేశారు. "అసమాన యుద్ధ తంత్రంలో శత్రువును ఎలా బలహీనపరచాలో మాకు బాగా తెలుసు. సులభంగా, వేగంగా దాడి చేయాలనే అమెరికా వ్యూహం విఫలమైంది" అని ఆ అధికారి వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో అబుదాబిలోని బోరూజ్ పెట్రోకెమికల్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గగనతలంలో దాడులను విజయవంతంగా అడ్డుకున్న తర్వాత, వాటి శకలాలు ఫ్యాక్టరీపై పడటంతో మంటలు చెలరేగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఘటనతో పశ్చిమాసియాలో ఉద్రిక్త వాతావరణం మరింత తీవ్రమైంది.

## హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్

**హైదరాబాద్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ నగర వ్యవస్థను ఆధునీకీకరించే దిశగా టీజీఎస్ఆర్టీసీ కీలక అడుగు వేస్తోంది. జీడిమెట్ల సమీపంలోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నగరంలోకి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సుల వల్ల తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు ఈ టెర్మినల్‌ను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం ఇటీవలే టీజీఎస్ఆర్టీసీకి 100 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ స్థలంలో అంతర్రాష్ట్ర, సిటీ బస్సుల కోసం వేర్వేరు టెర్మినల్స్ నిర్మించనున్నారు. ఇందులో భాగంగా సుమారు 30 ఎకరాలను అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల కోసం, మరో 20 ఎకరాల్లో ఆధునిక సౌకర్యాలు, షాపులతో కూడిన సిటీ బస్ టెర్మినల్ నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ఇక్కడి నుంచే నగరంలోని అన్ని ప్రాంతాలకు బస్సులు నడపనున్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 10 ఎకరాల్లో ఎలక్ట్రిక్ బస్సు డిపో, 15 ఎకరాల విస్తీర్ణంలో ఈవీ బస్సుల కోసం ప్రత్యేక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ బృహత్ ప్రణాళిక పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చితే హైదరాబాద్ శివారు ప్రాంతం నుంచి నగర రవాణా వ్యవస్థ మరింత పటిష్టం కానుంది.

## రాజేంద్రనగర్‌లో తెలంగాణ హైకోర్టు జోన్-2 భవనానికి శంకుస్థాపన

మొదటి పేజీ తరువాయి...

పరిజ్ఞానంతో నిర్మితమవుతున్న ఈ జోన్-×× భవనం ద్వారా న్యాయ సేవల వేగం మరింత పెరుగుతుందని అధికారులు వెల్లడించారు.

**న్యాయవ్యవస్థ బలోపేతం: జస్టిస్ సూర్యకాంత్**

తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న జనాభా, న్యాయపరమైన అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయమని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థకు అవసరమైన భవనాలు, సాంకేతికతను అందించడం ద్వారా సామాన్యులకు త్వరితగతిన న్యాయం అందుతుందని అన్నారు. కొత్త హైకోర్టు ప్రాంగణం కోసం అత్యంత విలువైన భూమిని కేటాయించినందుకు, నిర్మాణ పనులకు పూర్తి సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని జస్టిస్ సూర్యకాంత్ అభినందించారు.

## ఖానాపూర్‌ను కైవసం చేసుకున్న బీజేపీ

మొదటి పేజీ తరువాయి...

మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ, బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 12 కౌన్సిలర్ స్థానాలు ఉన్నాయి. ఇటీవల ఎన్నికల్లో బీఆర్ఎస్ 4, బీజేపీ 4, కాంగ్రెస్ 3, స్వతంత్రులు ఒకరు గెలుపొందారు. గందరగోళం నడుమ ఎన్నిక వాయిదా : స్వతంత్ర అభ్యర్థి, ఎక్స్ అఫీషియో ఓటుతో కాంగ్రెస్ బలం ఐదుకు చేరింది. ముందుగా ఛైర్‌పర్సన్ ఎన్నిక వేళ భారతీయ జనతా పార్టీ అభ్యర్థి మౌనిక పేరును అధికారులు ప్రతిపాదించారు. దీనిపై ఎమ్మెల్యే బొజ్జు అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందుగా బీజేపీ అభ్యర్థి పేరు ఎలా ప్రతిపాదిస్తారంటూ ఆందోళనకు దిగారు. ఈ గందరగోళం నడమే ఛైర్మన్ ఎన్నికను అధికారులు ఆదివారానికి వాయిదా వేశారు. దీంతో ఛైర్మన్ ఎన్నిక ఇవాళ్టికి వాయిదా పడింది. పోలీసుల భారీ బందోబస్తు నడుమ ఈరోజు ఉదయం మరోసారి ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కాగా, భారతీయ జనతా పార్టీ అభ్యర్థి అంకం మౌనికకు అనుకూలంగా బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన ఏడుగురు చేతులెత్తారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిన్నం సత్యానికి అనుకూలంగా ఆరుగురు తమ సంఘీభావం తెలిపారు. దీంతో బీఆర్ఎస్ సాయంతో ఛైర్మన్ పీఠం బీజేపీ కైవసం చేసుకున్నట్లైంది. ఛైర్మన్‌గా అంకం మౌనిక, వైస్ ఛైర్మన్‌గా బీఆర్ఎస్ అభ్యర్థి మహమ్మద్ షోయబ్ ఎన్నికయ్యారు.



జలమండలి కేంద్ర కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఈడీ సంతోష్.

## జలమండలిలో ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి

**హైదరాబాద్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

జలమండలిలో భారత స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలకు ఈడీ సంతోష్, డైరెక్టర్ పర్సనల్ మొహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ నాయకులు జలమండలి ప్రధాన కార్యాలయం నుంచి ఎల్బీ స్టేడియం వద్దనున్న జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఆపరేషన్స్ డైరెక్టర్లు వినోద్ భార్గవ, కార్యక్రమం కోఆర్డినేటర్, సీజీఎం లు ప్రభు, సుజాత, సీజీఎంలు, జీఎంలు, వివిధ కార్మికుల సంఘాల ప్రతినిధులు, జలమండలి ఎస్సీ ఎస్టీ, బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ల నాయకులు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న దళిత నేత జే బి రాజు


బుద్వేల్ లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్




మాట్లాడుతున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎ సదాలక్ష్మి

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఘనంగా బాబు జగ్జీవన్రాం 119వ జయంతి వేడుకలు




ఆరాంఘర్, బుద్వేల్ లలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి


ఆరాంఘర్ లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి

**బుద్వేల్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం):**

దళితులకు రాజ్యాంగ ఫలాలు అందేలా నిరంతరం పోరాడిన వ్యక్తి బాబు జగ్జీవన్ం అని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ లు అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ఆరాంఘర్ బాబు జగ్జీవన్ం చౌరస్తాలో ఆదివారం జరిగిన భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రాం 119వ జయంతి వేడుకలలో వారు పాల్గొని ప్రసం గించారు. మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ఛైర్మన్ దాసరి రమేశ్, ఛైర్మన్ నందిగామ నర్సింహ్మ, ప్రధాన కార్యదర్శి మంగలారం శ్రీనివాస్, కోశాధికారి పలుగుచెరువు మహేందర్ ల ఆధ్వర్యంలో అధికారికంగా బాబు జగీవన్ రాం జయంతి వేడుకలను నిర్వహించారు.




ఆరాంఘర్, బుద్వేల్ లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

మహనీయుల ఆశయాల సాధన కోసం యువతరం ముందుకు సాగాలి : పి కార్తీక్ రెడ్డి దేశంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం బాబు జగ్జీవన్రాం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే లు పనిచేశారని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి అన్నారు. విద్య ద్వారానే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సాదిస్తారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూ పాల్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎ సదాలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పి జీవన్ దాస్, పోతురాజు యాదయ్య, డాక్టర్ ఎస్ అమరేందర్, వై.శ్రీధర్, వనం నర్సింహ్మ మాదిగ, తలారి అశోక్, పలుగుకైరువు మహేశ్, కెఎస్ దయానం ద్. అనుమూల జాన్వాల్, పంబాల రాజు, వీపీ లలిత్, గుడిసె యాదయ్య, ఎడ్లకాడి సూర్యం, కోరని ప్రసాద్, కోరని వరప్రసాద్, సానెం శ్రీనివాస్ గౌడ్, జల్పల్లి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

**బుద్వేల్ లో....**

బుద్వేల్ లో అదుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షులు కోరని ప్రసాద్ , ప్రధాన కార్యదర్శి కోరని వరప్రసాద్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు దళిత సంఘాల నాయకులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు బాబు జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.


ఆరాంఘర్ లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులు అర్పించిన శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

# ఉపాధ్యాయులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి: ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

### ఎస్ జి టి యు ఉపాధ్యాయులు ప్రీమియర్ లీగ్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన గద్వాల ఎమ్మెల్యే

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 5(ప్రభాత ఉదయం)**

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ఉపాధ్యాయులు క్రీడా స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరముందని, ఉపాధ్యాయ సంఘాలు క్రీడా స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో వివిధ ప్రాంతాలలో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం లో ఎస్ జీ టియు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్ -1 క్రికెట్ టోర్నమెంట్ ను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే మ మాట్లాడుతూ...ఉపాధ్యాయులు కేవలం బోధనకే పరిమితం కాకుండా, విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తూ, స్వయంగా క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. క్రీడలు ఉపాధ్యాయులు, విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని పెంచుతాయన్నారు.ఉపాధ్యాయులు క్రీడలలో



చురుకుగా పాల్గొన్నప్పుడు, పాఠశాలల్లో "కలెక్టివ్ ఎఫెర్వెసెన్స్ ఏర్పడుతుంది అని ఇది విద్యార్థుల విజయానికి బాటలు వేస్తుంది అన్నారు.ఉపాధ్యాయులు పాఠశాలలో తరగతి గదిలలో విద్యార్థులకు విద్యను బోధించుతోపాటు అప్పుడప్పుడు మానసిక ఉల్లాసం కోసం ఉపాధ్యాయులు కూడా క్రీడలల్లో పాల్గొన్నాలని సూచించారు. మారుతున్న సమాజంలో పెరుగుతున్న పోటీతత్వంతో కార్పొరేటర్ పాఠశాలలతో దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధన అందించేందుకు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఇలాంటి సందర్భంలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కూడా క్రీడలతో మానసిక ఉల్లాషాన్ని పొందుతారని తెలిపారు.రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా గద్వాల జిల్లా లోని ఉపాధ్యాయులు క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడంఅభినందనీయమని వీరిని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలో అన్ని జిల్లాలలో కూడా ఉపాధ్యాయ సంఘాలు క్రీడా టోర్నమెంట్లు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందని, ఉపాధ్యాయుల మధ్య ఐక్యత స్నేహభావం పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, మాజీ కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ ఆంజనేయులు,నాయకులు ముత్యాల రవి, నాయకులు కార్యకర్తలు,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఈస్టర్ ఆరాధనలు


బైబిల్ సందేశాలను అందచేస్తున్న రెవరెండ్ కె సుందర్ పాల్



గండిపేట్ లో ఈస్టర్ అరుణోదయ ఆరాధనలో పాల్గొన్న పాస్టర్ మంగలారం ప్రేమ్ కుమార్


హైదర్ గూడ అగా పే ప్రేయర్ టెంపుల్ లో జరిగిన ఈస్టర్ ఆరాధనలో పాల్గొన్న విశ్వాసులు


కాటేదాన్ వెంకటేశ్వర కాలనీ లో గల షాలెం ప్రేయర్ చర్చ్ లో బైబిల్ సందేశాలను అందచేస్తున్న పాస్టర్ బట్టు శ్రీకాంత్


లక్ష్మీగూడ జీసస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్ లో ఈస్టర్ ఆరాధనలు


బుద్వేల్ ఈస్టర్ హిల్స్ లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

**బుద్వేల్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో ఆదివారం ఈస్టర్ ఆరాధనలు, ఈస్టర్ అరుణోదయ ఆరాధనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గుడ్ ఫ్రైడే రోజున సిలువ లో మరణించిన యేసు క్రీస్తు మూడవ దినమున తిరిగి లేచాడని నమ్మే క్రైస్తవులు ఆదివారం రోజున ఈస్టర్ ( యేసు పునరుత్థానం) ఆరాధనలను నిర్వహించారు. చర్చిలలో బైబిల్ సందేశాలను అందజేశారు. యేసయ్య ను విశ్వసించి ఆయన మార్గంలో నడుచుకుంటున్న వారికి యేసు పునరుత్థానం నిత్యజీవితాన్ని ప్రసాదిస్తుందని తెలియజేశారు. అత్తాపూర్ రాక్ చర్చిలో రెవరెండ్ కె సుందర్ పాల్, కాటేదాన్ వెంకటేశ్వర కాలనీ షాలేమ్ ప్రేయర్ చర్చి లో పాస్టర్ బట్టు శ్రీకాంత్, లక్ష్మీగూడ జీసస్ క్రైస్ట్ ప్రేయర్ మినిస్ట్రీస్ లో పాస్టర్ జాన్ వెస్లీ, హైదరగూడ అగాపే ప్రేయర్ టెంపుల్ లో పాస్టర్ సోమారం రాజ్ కుమార్ లు బైబిల్ సందేశాలను వివరించారు. వివిధ చర్చిలలో జరిగిన ప్రార్ధనలలో పాస్టర్లు రెవరెండ్ పి. స్వర్ణకుమార్, రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, రెవరెండ్ కె నతానియేల్, రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, పాస్టర్ సీహెచ్ దినకర్, రెవరెండ్ డి ఆనంద్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

**ఈస్టర్ హిల్స్ లో ఆరుణోదయ ఆరాధనలు :**

బుద్వేల్ ఈస్టర్ హిల్స్ లో యూనైటెడ్ క్రిష్టియన్ చర్చెస్ ఆధ్వర్యంలో ఈస్టర్ అరుణోదయ ఆరాధనలు నిర్వహించారు. మెథడిస్ట్ చర్చి పాస్టర్లు రెవరెండ్ జైలు, రెవరెండ్ సుకుమార్ ల నేతృత్వంలో ఈ ప్రార్ధనలు జరిగాయి. ప్రార్ధనలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ పాల్గొని క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం తదితరులు పాల్గొన్నారు.




## ఇంటింటికి సిపిఐ కార్యక్రమం

**బుద్వేల్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

సీపీఐ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆ పార్టీ నాయకులు ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ పటిష్టత కోసం విరాళాలు సేకరిం చారు. హైదర్ గూడ, ఉప్పర్ పల్లి ప్రాంతాలలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్రావు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మరెడ్డిలు పాల్గొన్నారు. పేదల పక్షాన నిలబడి పోరాడుతున్న పార్టీ కి అన్ని వర్గాల ప్రజలు అండదండలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి కాపురానికి రావడంలేదని ఓ భర్త ఆత్మహత్య

**బుద్వేల్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**


సయ్యద్ నవాజ్

ఎం ఎం పహడీలో సయ్యద్ నవాజ్ (35) అనే వ్యకి ఆదివారం తన నివాసంలో ప్యానుకు తాడు తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి కాపురానికి రాకపోవడంతో మనస్థాపానికి గురైన నవాజ్ ఆత్మహత్య చేసుకుని ఉం టాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కుటుంబ సభ్యులు అత్తాపూర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నవాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


హై కోర్టు జోన్ - 2 బ్లాక్ కు భూమి పూజ చేస్తున్న ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి. చిత్రంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, తదితరులు

## అట్టహాసంగా హై కోర్టు జోన్ - 2 బ్లాక్‌కు భూమి పూజ

**బుద్వేల్, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ లో హై కోర్టు కు కేటాయించిన 100 ఎకరాల భూమిలో ఆదివారం హై కోర్టు జోన్ 2 బ్లాక్ కు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తో కలిసి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమం త్రి ఎ రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. సభా ప్రాంగణానికి ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఉదయం 10:11 నిమిషాలకు చేరుకున్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఉదయం 10:30 నిమిషాలకు సభా ప్రాం గణానికి వచ్చారు. ఉదయం 10 :40 నిమిషాలకు హై కోర్టు జోన్ - 2 బ్లాక్ కు భూమి పూజలు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి చేశారు. ఈ పూజలు వేధ పండితుల మంత్రోచ్చరణల మధ్య జరిగాయి. పూజలలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ సూర్యకాంత్, హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి ఎస్ నర్సింహ్మ, జస్టిస్ ఉజ్జల్ భయాన్, జస్టిస్ ఎస్ వి బాటి, జస్టిస్ అలోక్ ఆరాధే లు పాల్గొన్నారు. భూమి పూజ అనంతరం సభా వేధిక ప్రారంభమైంది. ముఖ్య అతిథిలు, ముఖ్యమంత్రి ప్రసంగాల తర్వాత మద్యాహ్నం 1 :11 నిమిషాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హై కోర్టు కేటాయించిన స్థలంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం నుంచి వెళ్లి పోయారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మధ్నాహ్నం 1:14 నిమిషాలకు సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. హై కోర్టు జోన్ - 1లో గతంలో హై కోర్టు భవనాల నిర్మాణానికి భూమి పూజ జరుగగా పనులు ప్రారంభమైనాయి. హై కోర్టు జోన్ - 2 లో ప్రధాన న్యాయమూర్తి తో పాటు న్యాయమూర్తులు క్వార్టర్స్, అడ్వకేట్ జనరల్ చాంబర్, పరిపాలన భవనం నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అడ్వకేట్ జనరల్ ఎ సుదర్శన్ రెడ్డి, రిజిస్ట్రార్ జనరల్ ఎస్ గోవర్ధన్ రెడ్డి, హై కోర్టు అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ సురేందర్ రెడ్డి లతో పాటు పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


బుద్వేల్‌లో జరిగిన హిందూ సమ్మేళనంలో పాల్గొన్న ప్రజలు

## బుద్వేల్‌లో హిందూ సమ్మేళనం

**రాజేంద్రనగర్ , ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం) :**

హిందువుల ఐక్యమత్యం తో కుల,ప్రాంత,రాజకీయపార్టీలకు అతీతంగా హిందువులలో మన సనాతన ధర్మం పట్ల, సంస్కృతి పట్ల, మన దేశ భక్తి పట్ల, హిందువులలో చైతన్య పరిచే విధంగా హిందూ సమ్మేళనం నిర్వహించాలని బుద్వేల్ హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఏర్పాటు చేసుకోవడం జరిగింది అధ్యక్షులు: భాశెట్టి కుమార్ ప్రధాన కార్యదర్శి: కుక్కునూరి శ్రీనివాస్ గౌడ్ గార్ల సమక్షంలో ఉపాధ్యక్షులుగా,కార్యదర్శులుగా, మరియు సభ్యులు గా ఉప సమితిలు గామహిళా సమితి సంస్కృతిక మరియు ఆటలు సమితి నిధి సేకరణ సమితి స్వాగత సమితి ప్రచార సమితి మీడియా సమితి స్వచ్ఛంద సేవకుల సమితి లు ఏర్పాటు చేసుకోవడం జరిగింది ఈ హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని తేదీ: 19 ఏప్రిల్ ఆదివారం స్థలం: శ్రీ శివాంజనేయ దేవాలయం ప్రాంగణం బుద్వేల్ గ్రామం సమయం:సాయంత్రం: గం.5-30ని.ల నుండి రాత్రి 9 గంటల వరకు కార్యక్రమాలు జరపాలని నిర్ణయించడం జరిగింది

# పంతాల పంజరంలో...

## ఆత్మకూర్, అమరచింత ఐక్యతకే 'డీలిమిటేషన్' సవాల్

**వనపర్తి జిల్లా ప్రతినిధి (అమరచింత), ఏప్రిల్ 5(ప్రభాత ఉదయం)**

దేశవ్యాప్త నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) నగారా మోగుతున్న సందర్భంగా తెలంగాణలో అసెంబ్లీ స్థానాల పెంపు ఖాయమన్న సంకేతాల నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ పటమే మారబోతోంది. ఈ తరుణంలో వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్, అమరచింత ప్రాంతాలు ఒక చారిత్రక సంధిగ్ధంలో నిలబడ్డాయి. గతాన్ని సరిదిద్దుకునే అవకాశమా..? లేక మరోసారి గుర్తింపును కోల్పోయే ప్రమాదమా...? అన్నది ఇప్పుడు ఆ ప్రాంత ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం వచ్చింది.

**చేజారిన వైభవం... నేర్పిన పాఠం**

1952 నుంచి 2009 వరకు అమరచింత నియోజకవర్గం కేంద్రంగా ఉండగా... ఆత్మకూర్ ఒక వెలుగు వెలిగింది. కానీ, గత డీలిమిటేషన్ ప్రక్రియలో అమరచింత నియోజకవర్గం కనుమరుగైపోవడం ఈ ప్రాంత ప్రగతికి గొడ్డలిపెట్టుగా మారింది. కేవలం ఒక పేరు పోవడమే కాదు, నియోజకవర్గ కేంద్రం అన్న హోదా పోవడంతో ప్రభుత్వ కార్యాలయాలు తరలిపోయాయి, పరిపాలనా స్థాయి దిగజారింది. ఫలితంగా ఒకప్పుడు కళకళలాడిన ఆత్మకూరు, అమరచింత ప్రాంతాలు నేడు అభివృద్ధిలో వెనుకబడిపోయాయి. ఈ చేదు నిజాన్ని ఈ ప్రాంత ప్రజలు దశాబ్ద కాలంగా అనుభవిస్తూనే ఉన్నారు.

**చైతన్యం ఉంది... కానీ దిశ ఎటు..?**

ప్రస్తుతం మళ్లీ నియోజకవర్గ ఏర్పాటు చర్చ మొదలవ్వగానే అఖిలపక్ష సమావేశాలు, జేఏసీల సందడి పెరిగింది. ప్రజల్లో చైతన్యం రావడం ఆహ్వానించదగ్గ పరిణామమే. కానీ, ఈ చైతన్యం ఐక్యత వైపు కాకుండా విభజన వైపు మళ్లడం అసలుకే ఎసరు తెచ్చేలా ఉంది. కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రెండు కేంద్రాలు ఎవరికి వారే తమకే నియోజకవర్గం కేంద్రం కావాలని పట్టుబట్టడం ఆత్మాహుతి సదృశమే అవుతుంది. రెండు కళ్లూ ఒకే ముఖానికి చెందినవి. కానీ ఆ రెండు కళ్లూ పరస్పరం పోటీ పడితే చూపు మందగిస్తుంది. అమరచింత, ఆత్మకూరుల మధ్య సాగుతున్న ఈ శీతల సమరం వల్ల మూడో ప్రాంతం లాభపడే ప్రమాదం కూడా లేకపోలేదనే అభిప్రాయం కూడా ఉంది.

**భావోద్వేగమా... వ్యూహమా**

నియోజకవర్గం కావాలంటే కేవలం సెంటిమెంట్లు సరిపోవు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కనీసం లక్షన్నర ఓటర్లు, నాలుగు మండలాల భౌగోళిక సమీకరణ ఉండాలి. ఈ లెక్కలు సరితూగాలంటే ఆత్మకూర్, అమరచింతలు ఒకే వేదికపైకి రావాలి. ఎవరు నియోజకవర్గ కేంద్రం అన్న అహంకారాన్ని పక్కన పెట్టి, ఈ ప్రాంతానికి ఏది శ్రేయస్కరం అన్న కోణంలో ఆలోచించాలి. రాజకీయ నాయకులు, మేధావులు, యువత, రైతులు అంతా కలిసి ఒక సమగ్ర ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు వెళ్లాలి.

**ఇదీ... ఆఖరి అవకాశం**

డీలిమిటేషన్ అనేది కేవలం గీతలు గీయడం కాదు, అది అభివృద్ధికి దిక్సూచి. రాజకీయ ప్రాతినిధ్యం ఉంటేనే నిధులు వస్తాయి, ప్రాజెక్టులు వస్తాయి. ఈ ప్రాంత భవిష్యత్తు తరాల కోసం ఇదొక టర్నింగ్ పాయింట్. ఈసారి కూడా మనం మన లోపల ఉన్న విభేదాలతో ఈ చారిత్రక అవకాశాన్ని బలి ఇద్దామా..? లేక భేషజాలను వీడి ఏకతతో కొత్త చరిత్రను లిఖిద్దామా..? అనే ప్రశ్నకు సమాధానం మాత్రం ఐక్యతలోనే ఉంది.

కలిసి ఉందాం... పూర్వవైభవాన్ని సాధించుకుందాం




డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి తినేవాళ్ళు అర్పిస్తున్న పోలీస్ అధికారులు

## తెలంగాణ పోలీస్ అకాడమీ లో డాక్టర్ బాబు జగజ్జీవన్ రావుకు ఘనంగా నివాళ్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 5(ప్రభాత ఉదయం)**

ఆర్ బి వి ఆర్ ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ లో బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. భారత స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధానమంత్రిగా దేశానికి విశిష్ట సేవలు అందించిన డాక్టర్ జగజ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని, అకాడమీ అధికారులు ఆయన సేవలను స్మరించుకున్నారు. ముఖ్యంగా కుల వివక్ష, అంటరానితన నిర్మూలనకు ఆయన చేసిన పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అకాడమీ లో నీ ఏకశిల భవనంలో జరిగినఈ కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలదండలు అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి నేటి తరాలకుస్ఫూర్తిదాయకమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డీఎస్పీలు తిరుపతి, జగదీష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కృష్ణ, అడ్మిన్ మహేష్, క్వార్టర్ మాస్టర్ శ్రీను, ఫణి, లైజాన్ ఆఫీసర్ సిరాజు ,ప్రవీణ్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్లు, అవుట్‌డోర్ సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

**కొత్తకోట, ఏప్రిల్ 5(ప్రభాత ఉదయం)**

కొత్తకోట మున్సిపాలిటీ లో ఆర్ కే ఫంక్షన్ హాల్ లో పాపయ్య గారి బుచ్చిరెడ్డి మనవరాలు పుట్టు చీర వస్త్రధారణ కార్యక్రమం జరిగింది. ఈ వస్త్రాదరణ కార్యక్రమంలో కొత్తకోట మున్సిపల్ వైస్ చైర్మన్ పాపయ్యగారి పల్లవి కృష్ణారెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి మాజీ డైరెక్టర్. శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పుష్పాంజలు కట్టిస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలి: కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతిని, ఏప్రిల్ 5(ప్రభాత ఉదయం)**

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్ళాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్లోని నాంపల్లిలో జరిగిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలు, దురాచారాలు, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. స్వతంత్ర భారతదేశ తొలి దశలో కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా పని చేశారని, తదనంతరం రాజకీయాలలో ఎదుగుతూ కేంద్ర వ్యవసాయ, రక్షణ శాఖల మంత్రిగా సేవలందించి, ఉప ప్రధానమంత్రిగా దేశానికి కీలక సేవలు అందించారని తెలిపారు. దాదాపు ఐదు దశాబ్దాలపాటు ప్రజల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడిగా ఆయనను స్మరించారు. బాబు జగ్జీవన్ రామ్ డాక్టర్ అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ దళిత వర్గాలకు రిజర్వేషన్ల అమలులో కీలక పాత్ర పోషించారని తెలిపారు కార్మిక, వ్యవసాయ, రక్షణ మంత్రిగా, ఉప ప్రధానమంత్రిగా దేశానికి విశేష సేవలు అందించిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కొరకు మనం అందరం కలిసి పని చేయవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామరావు, దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## ఫతేనగర్‌లో ఘనంగా డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

**కూకట్ పల్లి, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్‌లో మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, సామాజిక సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహానుభావుడిని స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో విశేషంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించి, స్థానిక ప్రజలకు భోజనం వడ్డించారు. ఈకార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు కె.వై. దామోదర్ దాస్, ప్రధాన కార్యదర్శి కె. నందు, వైస్ ప్రెసిడెంట్ బాడోలా నగేష్, చీటకోరు కృష్ణ, రాము, బాబు, సంతోష్, చీటకోరు నరేందర్, కండెకర్ తదితరులు సమన్వయం చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, టీపీసీసీ ప్రోటోకాల్ కార్యదర్శి సూరజ్ తివారి, కార్పొరేటర్ అభ్యర్థి కంచి మహేందర్ యాదవ్, గోల్కొండ సతీష్ పాల్గొని బాబూజీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో నాయకులు మాధురి రాము, కుక్కల క్రాంతి కుమార్, వినయ్ ముదిరాజ్, కంచి రాజు, మాధురి సతీష్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని బాబూజీకి ఘన నివాళులు అర్పించారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడిన బాబూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పలువురు పిలుపునిచ్చారు.



## తెలంగాణ దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

### దళితుల హక్కుల సాధన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాదాపురం కృష్ణారావు

**కూకట్ పల్లి,ఏప్రిల్ 5,(ప్రభాత ఉదయం)**

తెలంగాణ దళిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డా. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డా. బాబూ జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేసి బాలానగర్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహానుభావుడు డా. బాబూ జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. సామాజిక సమానత్వం, దళితుల హక్కుల సాధన కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చింతా నర్సింగ్ రావు, కోశాధికారి సుంకే దీప్తి, సలహాదారులు మల్లిగారి లక్ష్మీనారాయణ, జేరిపోతుల రవీందర్ రావు, అశోక్ చిత్తారి, ఉపాధ్యక్షుడు మోతె బాలరాజు, మహంకాళి సూర్యనారాయణ, ఎడ్ల ప్రభాకర్, కనకం రవి, అమర్ నాథ్, హెచ్ఎఎల్ అశోక్, అదిముల్ల రాము, రమేష్, సత్యనారాయణ, మధు, బాబా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.




## హిందూ బంధువుల "ఐక్యతతో" ముందుకు సాగాలి

### హైదర్ గూడ లో దద్దరిల్లిన హిందూ సమ్మేళనం

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 5()**

హిందూ బంధువులు ఐక్యతతో ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ లో గల న్యూ ఫ్రెండ్స్ కాలనీ మైసమ్మ శాఖ గ్రౌండ్ లో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన హిందూ సమ్మేళనంలో హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త అనంత అచింత్య దాస్ మాట్లాడుతూ... దేశానికి ఆత్మ హిందూ ధర్మము, హిందూ సంస్కృతీ , హిందూ సమాజం. కావున హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి సమైక్యపరిచి మన దేశాన్ని తిరిగి విశ్వగురువుగా నిలపాలనే లక్షంతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 1925లలో ప్రారంభించారన్నారు. ఈ 100 సంవత్సరాల ప్రయాణంలో అనేక ఎత్తుపల్లాలను చూసింది. నేటి కాలమాన పరిస్థితుల్లో ఎదురౌతున్న అనేక సవాళ్ళను ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత అవసరం అని పిలుపునిచ్చారు. హిందూ సమాజం పట్ల గౌరవభావం, ఏకత్మతా భావన, స్వధర్మం పట్ల అంకితభావం, సేవాగుణం వంటి వాటిని వికసింపచేసేందుకు మీ అందరి భాగస్వామ్యాన్ని కోరుకుంటూ హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమ్మేళనంలో గోల్కొండబాగ్ కార్యకరిని మలిపెద్ది శంకర్, అన్నపూర్ణ (పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్, అత్తాపూర్), అధిక సంఖ్యలో హిందువులు పాల్గొన్నారు.

## గజ్వేల్ బిఆర్ఎస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం!!

### - కడవెండి బిఆర్ఎస్ గ్రామ సర్పంచ్ భాషిపాక రాములు

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 05(ప్రభాత ఉదయం):**



గజ్వేల్ బిఆర్ఎస్ కార్యాలయం పై దాడిని జిల్లా లోని దేవరుప్పుల మండలం, కడవెండి బిఆర్ఎస్ పార్టీ గ్రామ సర్పంచ్ భాషిపాక రాములు తీవ్రంగా కండించారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో శాంతి, ప్రజాస్వామ్య విలువలు అత్యంత ముఖ్యమైనవి. అయితే గజ్వేల్‌లోని భారత్ రాష్ట్ర సమితి (బిఆర్ఎస్ ) పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ గుండాల జరిపిన దాడి తీవ్ర ఆందోళన కలిగించే ఘటనగా నిలిచిందని . ఈ దాడి ప్రజాస్వామ్యానికి విరుద్ధమైనది మాత్రమే కాకుండా, రాజకీయ సంస్కృతికి మచ్చగా నిలుస్తోందని .ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తు, రాజకీయ విభేదాలు సహజం, కానీ అవి హింసకు దారితీయడం అసహ్యకరం. చర్చలు, వాదనలు, ఎన్నికల ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తపరచడం ప్రజాస్వామ్య మార్గం. కానీ గుండాల దాడులు చేయడం ద్వారా భయాందోళనలు సృష్టించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ప్రత్యేకంగా కెసిఆర్ నాయకత్వంలో అభివృద్ధి పథంలో నడిచిన తెలంగాణ రాష్ట్రం , గజ్వేల్ నియోజకవర్గంలో ఇటువంటి సంఘటనలు జరగడం బాధాకరమని, ప్రజలు శాంతి భద్రతలను కోరుకుంటున్న సమయంలో ఇలాంటి దాడులు అసహనం కలిగిస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే ఈ ఘటనపై కఠిన చర్యలు తీసుకుని, దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని, అలాగే భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అన్ని రాజకీయ పార్టీలను విజ్ఞప్తి చేస్తున్నాము---హింసా రాజకీయాలకు దూరంగా ఉండాలి,!! ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని . ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి, అభివృద్ధి కోసం కృషి చేయాలని ఈ సందర్భంగా సర్పంచ్ హితవు పలికారు..

## డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాల కోసం ముందుకు సాగాలి: ఎమ్మెల్యే జిఎంఆర్

**కొత్తకోట, ఏప్రిల్ 5( ప్రభాత ఉదయం)**



కొత్తకోట పట్టణ కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు. ఆదివారంకొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో స్వర్గీయ భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో భారత మాజీ ఉప ప్రధానమంత్రి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119.వ జయంతి సందర్భంగా కొత్తకోట చౌరస్తాలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధునికరించిన మెట్లను ప్రారంభించి పూలమాలలు వేసి ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మాట్లాడుతూ సమానత్వ దినోత్సవం' సందర్భంగా సామాజిక సాధికారత కోసం ప్రతి ఒక్కరు మహనీయులు బాబు జగ్జీవన్ రామ్ జాడల్లో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుధమ , మదనపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్, కొత్తకోట మున్సిపాలిటీ చైర్మన్ అరుణ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లవి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు ఎన్ జే. బోయేజ్, సుధా రామ్మోహన్ రెడ్డి, హజ్మత్ ఖానం సలీం ఖాన్, పి. రవీందర్ రెడ్డి, సంజీవులు, భీమా చంద్రకాంత్, జి మురళి, కరాటే నభి, మంజుల రామకృష్ణ, కొత్తకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగవరపు బీచ్ పల్లి యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ పి జె బాబు ,మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు జె ఎం . మేషేక్,మండల మాజీ కోఆప్షన్ సభ్యులు వీణ. లతీఫ్, వనపర్తి జిల్లా కిసాన్ జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి,శేఖర్ రెడ్డి, యాదగిరి రెడ్డి,వెంకటేశ్వర రెడ్డి, సురేందర్ రెడ్డి ,మోహన్ రెడ్డి, రామ్ లాల్ ,సంద వెంకటేష్, నరేందర్ సాగర్, సాయిరాం యాదవ్, శ్రీనివాసులు, ఇబ్రాయిల్, సాయిలు యాదవ్, పెంటన్న యాదవ్, ప్రసాద్, శంకర్ యాదవ్, కొమ్ము అనిల్, మహిమ రాజు,సాయిలు, శాంతన్న,లక్ష్మయ్య, కృష్ణయ్య, శాంతయ్య, దేవదానం, రమణయ్య, రమేష్, అంజన్న సాగర్, తిరుపతి మన్నెం,వెంకటయ్య, ముజీబ్, టైలర్ గఫార్,బాబా,తయ్యబ్ ,మతిన్, ఇజాజ్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

# డా. బాబు జగ్జీవన్ రామ్ చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలి

**మునిసిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి**

**సమాజానికి మార్గదర్శకుడు -- డా. బాబు జగ్జీవన్ రామ్: డీసీపీ రాజ మహేంద్ర నాయక్**

**సమాజ మార్పుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 05(ప్రభాత ఉదయం):**


మాట్లాడుతున్న డిసిపి రాజమహేంద్ర నాయక్

జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయ ఆవరణలో భారత మాజీ ఉప ప్రధాని, దళిత వర్గాల ఆశాజ్యోతి, సమతావాది డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాల కారక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మునిసిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, విశిష్ట అతిథులుగా డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన గావించి, కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ నేపథ్యంలో మునిసిపల్ ఛైర్పర్సన్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు డా. బాబు జగ్జీవన్ రామ్ అని పేర్కొన్నారు. చిన్న వయసులోనే సమాజంలో సమానత్వం పట్ల ఆసక్తి పెంచుకున్నారన్నారు. దళితుల హక్కు కోసం ఆయన చేసిన పోరాటం ఎనలేనిదన్నారు. భారత ప్రభుత్వంలో అనేక పదవుల్లో బాధ్యతలు చేపట్టి, దేశ అభివృద్ధిలో కీలక పాత్రను పోషించారన్నారు. ఈ క్రమంలో ఆయన చూపిన మార్గాన్ని అందరూ అనుసరించాలని తెలిపారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. డా. బాబు జగ్జీవన్ రామ్ సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆయన దేశానికి, ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. జగ్జీవన్ రామ్ ఆశయాలను భావి తరాలకు తీసుకెళ్లాలని సూచించారు. సమాజంలో బడుగు, బలహీన వర్గాల ఐక్యత ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో క్రమబద్ధమైన జీవితాన్ని అలవరచుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు మాత్రమే వాహనాలను నడపాలని, వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం (హెల్మెట్ ) ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. తదనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ.. ఈరోజు ఒక గొప్ప రోజు అని, సమాజంలో మార్పు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడిని స్మరించుకుంటున్నామని, ఆయన జీవితం అందరికీ ఒక మార్గదర్శకమని అన్నారు. సామాజిక సమానత్వం గురించి మాటల్లో మాత్రమే కాకుండా, కార్యరూపంలో చూపించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన సంకల్పం కేవలం మాటల్లో కాదు, కార్యాచరణలో ప్రతిఫలించిందన్నారు. సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు ఆయన తన ఆలోచనలు, చర్యల ద్వారా ప్రజలపై ప్రభావం చూపించారన్నారు. ప్రతి వ్యక్తి ఆలోచనా విధానం మారాలని, సమాజంలో చైతన్యం కలగాలి అన్నదే ఆయన ఆశయమని పేర్కొన్నారు. ఆర్థిక సమానత్వం, రాజకీయ చైతన్యం ప్రతి పౌరుడిలో ఉండాలని, ప్రభుత్వ పథకాలు బడుగు బలహీన వర్గాలకు చేరినప్పుడే సమాజంలో మార్పు వస్తుందని, ఇలాంటి మహనీయుల ఆలోచనలు, ఆశయాలు మనకు ప్రేరణగా ప్రతిబింబిస్తాయని, సమాజంలో సమానత్వం సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కేకు కోసి, కార్యక్రమాన్ని వైభవంగా ముగించారు. అంతకుముందు తెలంగాణ సాంస్కృతిక కళాకారులచే డా. బాబు జగ్జీవన్ రామ్ అని జయంతి సందర్భంగా కళాజాత నిర్వహించి, పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు గద్దర కిషోర్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవి లత, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, డా. సుగుణాకర్ రాజు, డా. రాజమౌళి, గద్దల నరసింహారావు, మేడ శ్రీనివాస్, అడ్వకేట్ సాదిక్ అలీ, నీర్మల రాములు, మల్లిగారి రాజు, మల్లిగారి మధు, కన్నారపు ఉపేందర్, జేరుపోతుల కుమార్, రాగల్ల ఉపేందర్ , ఉడుగుల సాగర్, గిరిమల్లె రాజు, జేరిపోతుల ఉపేందర్, గజ్వేలి ప్రతాప్, తిప్పారపు విజయ్, నక్క సురేష్, సుద్దాల కుమారస్వామి, డా. బాలాజీ, డా. రంజిత్, మౌనిక, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ ఈటల రాజేందర్ పుష్పగుచ్ఛం అందజేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు


# విశ్వవిద్యాలయాలకు మరిన్ని కేంద్ర నిధులు

## ఎంపీ ఈటల రాజేందర్

**ఎంపీ ఈటెల రాజేందర్ ను కలిసిన ఉద్యాన వర్సిటీ ఫ్యాకల్టీ బృందం**

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 5(ప్రభాత ఉదయం)**

ఏడో రివిజన్ కమిషన్ యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ బకాయిలను భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి అందదంలో చాలా కృషి చేసినందుకు కృతజ్ఞతగా శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ తూట అధ్యక్షులు డాక్టర్ నిఖిల్ ఆధ్వర్యంలో మెంబర్ అఫ్ పార్లమెంట్ ఈటెల రాజేందర్ ని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఉద్యాన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి రాజి రెడ్డి వర్సిటీకి యూజీసీ అరియర్స్ రావడంలో చేసిన కృషి చాలా గొప్పదని అన్నారు. ఈ సందర్భంగా ఎంపి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ... విశ్వవిద్యాలయాలకు మరిన్ని నిధులు కేంద్రం నుంచి తీసుకొచ్చి పరిశోధనలు ముమ్మరం చేయించి తద్వారా రైతులకు సాగులో సలహాలు అంది లాభాలు వచ్చేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులకు ఎప్పటికి అందేలా అందరూ ప్రయత్నం చేయాలని ఎంపీ కోరారు. రైతుల కోసం కేంద్రం కావాల్సిన అన్ని పథకాలు ప్రవేశపెట్టినందుకు సిద్దంగా ఉందని సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పిడిగం సైదయ్య, ఇంజనీర్ అశ్విన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ జి సతీష్ పాల్గొన్నారు.


డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి లో కలెక్టర్

# ఘనంగా డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 05(ప్రభాత ఉదయం):**

భారత మాజీ ఉప ప్రధాని, దళిత వర్గాల ఆశాజ్యోతి, సమతావాది డా. బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆర్ అ బీ గెస్ట్ హౌస్ వద్ద గల ఆయన విగ్రహానికి మునిసిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పూలమాల వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు. అదే విధంగా ఏసీపీ పండరి చేతన్ నితిన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవి లత, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు, మహనీయులు కమిటీ, షెడ్యూల్డ్ కులముల సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, ఎస్సీ సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు కూడా డా. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.



# రామకృష్ణ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జనంపల్లి పురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేయించి ఘనంగా సన్మానం చేసిన యూత్ కమిటీ సభ్యులు**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు రామకృష్ణ గణేష్ ఉత్సవ యూత్ కమిటీ సభ్యులు, యూత్ అధ్యక్షులు భార్గవ్ కార్యదర్శి, నందు ట్రెజరర్, అశ్విత్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది యూత్ కమిటీ సభ్యులు ఆయనకి ఘనంగా సన్మానం చేసి కేక్ కటింగ్ చేసి స్వీట్లు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ గణేష్ తాండవ కృష్ణ, శ్రీధర్, సుధాకర్, సంజీవరెడ్డి, ప్రసాద్, జి నర్సింగరావు, వెంకటేశ్వరరావు, జలంధర్ రెడ్డి, ఈ రాజేందర్, కాశీనాథ్, యాదవ్, సి కె రెడ్డి, అరవింద్ రావు, కమిటీ సభ్యులు, యూత్ కమిటీ సభ్యులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని శాలువలతో సన్మానం చేసి కేకులు కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నర్సింగరావు, ప్రసాద్, శ్రీధర్ రావు, గణేష్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాట్లు ఘనంగా చేశారు.



# క్రీడలు క్రమశిక్షణను, ఐక్యతను, పోటీ తత్వాన్నిపెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి

**నేటి తరం యువత పెడదారి పట్టకుండా క్రీడలపైన ఆసక్తి పెంపొందించుకోవాలి**

**పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**


శ్రీ గౌరీ గవర సేవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గవరస్ ప్రీమియర్ లీగ్ (జీపీఎల్ ) క్రికెట్ టోర్నమెంట్ పోటీల ముగింపు వేడుకలు లొయోల కాలేజ్ గ్రౌండ్ లో ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం విచ్చేసి విజేత జట్లకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యం, క్రీడాస్ఫూర్తి కూడా పెరుగుతాయని, క్రీడలు క్రమశిక్షణ, ఐక్యత, పోటీ తత్వాన్ని అలవర్చుతూ యువతను ఆరోగ్యకరమైన, సానుకూల మార్గంలో నడిపిస్తాయని తెలిపారు. విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తూ, రాష్ట్ర బడ్జెట్ లో క్రీడలను ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నారని, యువత క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరి జీవితంలో క్రీడలు భాగం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, బుద్ద రమణ బాబు, శశిధర్, రామ్ కుమార్, ఆదివిష్ణు, ఆర్గనైజర్లు రాజేష్, సత్యనారాయణ, బాలాజీ, క్రీడ బృందాలు రెడ్ ఛార్జర్స్, గోల్డెన్ నైట్స్, బ్లూ వారియర్స్, టైటాన్స్ ప్లేయర్స్, క్రీడాకారులతోపాటు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గిట్టుబాటు ధర లేక దోసతోటను వదిలేసినా రైతు

**పండిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి.**

**ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సభ్యుడు మంతపురి యాదగిరి**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 05(ప్రభాత ఉదయం):**


దోసకాయతోటలో ఆదర్శ రైతు

గిట్టుబాటు ధర లేక దోసతోటను వదిలేసినా రైతు సంఘటన ఆదివారం జిల్లా లోని రఘునాథపల్లి రామన్నగూడెం గ్రామానికి చెందిన రైతు వాకిటి చంద్రారెడ్డి ఉదంతం నిలుస్తోంది. ఆయన తనకున్న రెండు ఎకరాల పొలంలో ఎంతో కష్టపడి దోస తోట సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో కనీస గిట్టుబాటు ధర లేకపోవడంతో, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేక తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పెట్టిన పెట్టుబడి కూడా దక్కదని గ్రహించి, విధిలేని పరిస్థితుల్లో తోటను కోయకుండా అలాగే వదిలేశారు.

ఈ ఘటనపై మధ్యమండలి వరంగల్, ఖమ్మం, మెదక్ జిల్లాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సభ్యుడు మంతపురి యాదగిరి తీవ్రంగా స్పందించారు. రైతుల పక్షాన నిలబడి ఆయన ప్రభుత్వానికి పలు డిమాండ్లు వినిపించారు

మార్కెటింగ్ లోపం: రైతులు పండించిన కూరగాయలకు, ఇతర పంటలకు మద్దతు ధర నిర్ణయించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

మంత్రిత్వ శాఖ బాధ్యత: వ్యవసాయ శాఖ మంత్రి తక్షణమే జోక్యం చేసుకుని, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి జీవోలు విడుదల చేయాలన్నారు. గ

రుణమాఫీ ఆ పంటల బీమా: రైతులకు హామీ ఇచ్చినట్లుగా రూ. 2 లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలి. అలాగే పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేసి నష్టపోయిన వాకిటి చంద్రారెడ్డి వంటి రైతులకు న్యాయం చేయాలన్నారు.

కేవలం మాటలకే పరిమితం కాకుండా, రైతును నిజమైన రాజును చేసేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలని ఈ సందర్భంగా యాదగిరి డిమాండ్ చేశారు.



# గాయత్రీ నగర్‌లో మజ్జిగ పంపిణీ కార్యక్రమం

**మజ్జిగ పంపిణీ చేసిన ముమ్మారెడ్డి ప్రేమ కుమార్**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని గాయత్రీ నగర్ డివిజన్, వివేకానంద కాలనీలో ఆదివారం ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకులు పవన్ నాయుడు, ప్రభాకర్ సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ మున్సిపల్ జనసేన పార్టీ కోఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ విచ్చేసి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం ప్రారంభమైన వెంటనే ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులు ప్రేమ కుమార్ ను శాలువాతో సత్కరించి తమ గౌరవాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జల్లా రవి, తుంగల రామారావు, సూర్యనారాయణ, అడ్డాల వీరబాబు, ప్రసాద్, రామ్, గౌతమ్ తో పాటు వీర మహిళలు లక్ష్మి, వరమ్మ, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడికాలంలో ప్రజలకు చల్లని ఉపశమనం అందించే ఈ విధమైన సేవా కార్యక్రమాలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి.

# ఎల్పీజీ సరఫరాపై ఆందోళన వద్దు

**కేంద్ర ప్రభుత్వం ప్రకటన**

**5 కిలోల సిలిండర్లు విరివిగా లభిస్తున్నట్లు స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 5 (ప్రభాత ఉదయం)**

దేశవ్యాప్తంగా ఎల్పీజీ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి ఆటంకాలూ లేవని, దీనిపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. 5 కిలోల ఎల్పీజీ(ఎఫ్‌టీఎల్ సిలిండర్లు) అమ్మకాలను గణనీయంగా పెంచినట్లు పేర్కొంది. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో గుర్తింపు కార్డులను చూపించి వీటిని పొందొచ్చని, నివాస ధ్రువీకరణ పత్రాలతో పనిలేదని తెలిపింది. గత నెల 23 నుంచి ఇప్పటివరకూ 6.6 లక్షలకుపైగా ఎఫ్‌టీఎల్ సిలిండర్లను ప్రజలు కొనుగోలు చేసినట్లు కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒక్క శనివారం(4వ తేదీ) రోజే 51 లక్షల గృహవినియోగ సిలిండర్లను డెలివరీ చేసినట్లు పేర్కొంది. అందులో 95 శాతం ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసినవే అని చెప్పింది.

**50వేలకు పైగా సిలిండర్ల స్వాధీనం**

బ్లాక్‌మార్కెట్లో గ్యాస్ సిలిండర్లు అమ్ముతున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రం తెలిపింది. గత నెల నుంచి ఇప్పటివరకూ అక్రమంగా నిల్వ ఉంచిన 50వేలకు పైగా సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. దీంతోపాటు 1,400కు పైగా డిస్ట్రిబ్యూటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, 36 డీలర్‌షిప్‌లను సస్పెండ్ చేసినట్లు పేర్కొంది. గృహ వినియోగం, అత్యవసర సేవల(ఆసుపత్రులు, విద్యాసంస్థలు) కోసం ప్రభుత్వం ఎల్పీజీ, పీఎన్‌జీ సరఫరాలకు ప్రాధాన్యం ఇస్తోంది. గృహాలు, రవాణా రంగాలకు పీఎన్‌జీ సరఫరా పూర్తిస్థాయిలో కొనసాగుతున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608